డ్రెయినేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం

- రూ.2 కోట్లతో నూతన డ్రెయిన్‌ల నిర్మాణం
- పట్టణ ప్రజలకు ముంపు నుంచి విముక్తి



గోపాల్‌నగర్ మెయిన్ రోడ్డులో పూర్తయిన డ్రెయిన్ నిర్మాణం

యానాం: పట్టణ పరిధిలో ఫ్రెంచి హయాంలో వేసిన డ్రెయినేజీ వ్యవస్థ శిథిలస్థితికి చేరుకోవడంతో చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులు, వీధులు సైతం ముంపుబారిన పడుతున్నాయి. అందుకే ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చొరవ తీసుకుని రూ.2 కోట్లు మంజూరు చేయించడంతో నూతన డ్రెయినేజీల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో పట్టణంలోని పలు వీధులు, ప్రధాన కూడళ్లు, దేవాలయాల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా శాశ్వత ప్రాతిపదికన సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రెంచి హయాంలో వేసిన డ్రెయినేజీలే

యానాం పట్టణంలో ఫ్రెంచి హయాంలో వేసిన డ్రెయినేజీ వ్యవస్థే ఇప్పటికీ ఉంది. ఒకపక్క జనాభా పెరుగుతున్నా వాటిని ఆధునీకరించకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే పట్టణంలోని పలు ప్రధాన మార్గాలు ముంపునకు గురయ్యేవి. ముఖ్యంగా పిల్లారాయవీధి, పోలీస్‌స్టేషన్ వీధి, స్టేట్‌బ్యాంక్ రహదారి, విష్ణాలయం వీధి, దోబీవారి వీధి, బెజవాడ గార్డెన్స్, గోపాల్‌నగర్, తోటవారి వీధి, షేక్ లాలా వీధి తదితర ప్రధాన ప్రాంతాల్లో డ్రెయిన్‌లు చిన్నవిగా ఉండటంతో మురుగునీరు శివారుకు వెళ్లే దారిలేక అక్కడే నిలిచిపోయేది. దీంతో రెండు రోజులైనా రహదారిపై మురుగు నీరు కదలక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో నిర్మాణం

యానాం పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని నూతనంగా వెలిసిన అనేక కాలనీల్లో సైతం ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో పాటు ప్రభుత్వ నిధులను కలుపుకుని రూ.2 కోట్లు కేటాయించారు. ఇప్పటికే జనసంచారం ఎక్కువగా ఉండే పిల్లారాయ దేవాలయం నుంచి పిల్లారాయవీధిలో డ్రెయినేజీ నిర్మాణం పూర్తిచేశారు. దీంతో అక్కడ మురుగునీరు నిలవడం లేదు. అదేవిధంగా తోటవారివీధి, గోపాల్‌నగర్ మెయిన్‌రోడ్డు డ్రెయినేజీని సైతం పూర్తి చేశారు. అంబేద్కర్‌నగర్ వీధి, కామరాజ్‌నగర్, అబ్దుల్‌కలామ్‌నగర్, షేక్‌లాలావీధిలో డ్రెయిన్ పనులు త్వరలో ప్రారంభించనున్నారు.



తోటవారివీధిలో నూతన డ్రెయిన్

సమస్యకు పరిష్కారం చూపిస్తాం



యానాం పట్టణంలో ఇంత కాలం చిన్నపాటి వర్షానికే మురుగు కాల్వలో నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీనికి శాశ్వత పరిష్కారంగా కోట్లాది రూపాయిల ఖర్చుతో డ్రెయిన్‌లు కావాల్సిన చోట వేయడానికి నిర్ణయం తీసుకున్నాం. ఇప్పటికే పలుచోట్ల పనులు పూర్తవ్వగా మరికొన్నిచోట్ల జరుగుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేనేజర్ మోహన్‌రావు

కాట్రేనికోన: స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో మంగళవారం యూనియన్ బ్యాంకు మేనేజర్ మోహన్‌రావు నేతృత్వంలో అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సబ్ మేనేజర్ లీలా శరత్ చంద్రవర్మ, కళాశాల కరస్పాండెంట్ నాగరాజు, అధ్యాపకులు కొంకి రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తాళ్లరేవు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల ఎస్టీయూ సంఘ ప్రతినిధులు మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద ఎంఈఓ ఎ.మంగాయమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి యు.లోవరాజు, బి.సునీల్, సోమలత, ఎం.మియాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరించిన ఎంపీ అనురాధ

అమలాపురం రూరల్: మండలంలోని మెగ్గలమూరు ఎంపీ కార్యాలయంలో డొక్కా సీతమ్మ ఉత్తమ అవార్డు గ్రహీతలైన రెడ్డిపల్లికి చెందిన కరాటం ప్రవీణ్, నడిపూడి సర్పంచ్ చెల్లిబోయిన వెంకటేశ్వరరావులను ఎంపీ చింతా అనూరాధ మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో కేవీఆర్ఎస్ నరసింహరావు, ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా దివాకర్, జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, కె.మనోహర్, బొక్క ఆదినారాయణ, అప్పారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద హుండీల చోరీ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామంలో పలు చోట్ల హుండీల చోరీలు జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కోటమాయమ్మ, చింతల చెరువు, నందిబలమ్మ వద్ద దేవాలయాల్లో దొంగలు హుండీలను దోచుకెళ్లారు. గత వారంలో మండలంలోని సూదాపాలెంలో ఉన్న ఆలయంలో హుండీలో సొమ్మును దోచుకున్న వ్యక్తి సీసీ ఫుటేజీని స్థానికులు పోలీసులకు అందజేశారు. ఆలయాల వద్ద వరుసగా జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

సీఎం రంగసామితో ఎమ్మెల్యే అశోక్ భేటీ

యానాం: పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామిని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆయన స్వగృహంలో కలిసి వివిధ ప్రజాసమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యానాంలో ఉన్న మత్స్యకారులకు ఓఎన్‌జీసీ సంస్థ మంజూరు చేసిన వేట నష్టపరిహారం అందించాలని కోరారు. అర్హులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని సీఎం రంగసామి బదులిచ్చారు. పీడబ్ల్యూడీ శాఖలో ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందికి ఎంటీఎస్ పదోన్నతిని కల్పించాలని, యానాం రీజెన్సీ పరిశ్రమను పునఃప్రారంభించడానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అడిగారు.

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు



పోటాపోటీగా జరుగుతున్న టేబుల్ టెన్నిస్ పోటీలు

యానాం: స్థానిక వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన టేబుల్ టెన్నిస్ జోనల్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా అండర్–14 బాలుర విభాగంలో రాజీవ్‌గాంధీ ఇంగ్లిష్ మీడియం ప్రథమ స్థానం, కామిశెట్టి వరప్రసాదరావు నాయుడు గవర్నమెంట్ స్కూల్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. అండర్–17 బాలుర విభాగంలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ ప్రథమ, డాక్టర్ కేఆర్ నారాయణన్ దరియాలతిప్ప స్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. జోనల్ గేమ్స్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారని కార్యదర్శి పాము సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు నక్కల సుబ్బన్న, కొప్పనాతి భాస్కర్, ఐవీకే మోహన్, వినకోటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై కొనసాగుతున్న విచారణ



నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్న డీపీఎం విజయ్‌కుమార్, ఏజీఎం ప్రసన్నలక్ష్మి

అల్లవరం: మండలంలోని గూడాల గ్రామ సమాఖ్య సంఘంలో స్త్రీ నిధి, ఉన్నతి నిధులను యానిమేటర్ దుర్వినియోగం చేశారన్న అభియోగంపై డీఆర్‌డీఏ డీపీఎం విజయకుమార్, స్త్రీనిధి బ్యాంక్ ఏజీఎం ప్రసన్నలక్ష్మి స్థానిక సచివాలయంలో మంగళవారం విచారణ చేశారు. గూడాల–3 పరిధిలో 44 గ్రూపులకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యుల వద్ద ఉన్న డేటా ఆధారంగా విచారణ చేపట్టారు. ఈ నెల 3న 12 గ్రూపులకు, మంగళవారం 15 గ్రూపులకు విచారణ చేశారు. మొత్తం గ్రూపుల్లోని లోపాలను గుర్తించిన తర్వాత ఎంతమేర నిధులు దుర్వినియోగమయ్యాయో వెల్లడిస్తామని డీపీఎం విజయకుమార్ తెలిపారు. గూడాల–3 యానిమేటర్‌ని అధికారులే కాపాడుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, ఏపీఎం సయ్యద్ పాల్గొన్నారు.

ప్రాథమిక భాషా దీపిక పుస్తకావిష్కరణ



పాతయింజరంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: మండలంలోని పాతయింజరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి రచించిన 'ప్రాథమిక భాషా దీపిక' పుస్తకాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సులభతరంగా తెలుగు భాషను నేర్చుకోవడానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి తన 25 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తి అనుభవాలను పిల్లలకు ఉపయోగపడేలా తెలుగు పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు ఢిల్లీ నారాయణ, మోకా రవి, పిన్నంరాజు బాబ్జిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



మానస్



అక్కల జోషిక



మంద సంజన

అమలాపురం రూరల్: ఇటీవల కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి అల్లు మానస్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల పీడీ కె.గణేశ్వరరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి విశాఖపట్టణంలోని స్వర్ణభారతి స్టేడియంలో జరిగే రాష్ట్ర పోటీల్లో జిల్లా తరఫున మానస్ ఆడతాడన్నారు. ఈ సందర్భంగా మానస్‌ను సర్పంచ్‌లు నక్కా రాజారత్న నాగవాణి, పరమట శ్యామ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు నాగసత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ కుంచె వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ కరేళ్ళ జగదాంబ, పరమట భీమమహేష్ అభినందించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ గొలకోటి ఫణీంద్ర మంగళవారం తెలిపారు. గొల్లవిల్లి పాఠశాలలో చదువుతున్న అక్కల జోషిక, మంద సంజన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున జరిగిన ఎంపికల్లో అండర్–14 విభాగంలో వాలీబాల్ లో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.రాణి, పీడీ డి.సరస్వతి, పీఈటీ వి.విజయభాస్కర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తిక వన సమారాధన విజయవంతం చేద్దాం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురం వేదికగా నిర్వహించనున్న శెట్టిబలిజల కార్తిక వన సమారాధనను విజయవంతం చేయాలని తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. అమలాపురం శ్రీరామపురంలో జిల్లా శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులతో మంగళవారం జరిగిన శెట్టిబలిజల కార్తిక వన సమారాధన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శెట్టిబలిజల అభివృద్ధి కోసం తొలినాళ్లలో పలువురు సామాజిక వర్గ నాయకులు చేసిన కృషి చిరస్మరణీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరించారు. సమావేశంలో శెట్టిబలిజ యువజన కమిటీ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్, మట్టపర్తి నాగేంద్ర, వాసంశెట్టి సత్యం, చెల్లుబోయిన శ్రీనివాసరావు, దొమ్మేటి రాము, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు సన్నాహాలు



సమావేశంలో మాట్లాడుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీ

అమలాపురం టౌన్: పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ అన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు ఆటోనగర్‌కు అవసరమైన 20 ఎకరాల స్థల సేకరణకు చాంబర్ అన్వేషణ మొదలు పెట్టిందని వెల్లడించారు. స్థానిక యర్రమిల్లి వారివీధిలో గల సైకిల్ పాల వ్యాపారుల భవనంలో మంగళవారం ఉదయం జరిగిన చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశానికి తాతాజీ అధ్యక్షత వహించి ప్రసంగించారు. సమావేశంలో ఆటోనగర్ ఏర్పాటు, స్థల సేకరణపై చర్చించారు. అధ్యక్షుడు తాతాజీ మాట్లాడుతూ స్థల సేకరణకు అయ్యే ఖర్చులో చాంబర్ 30 శాతం, ప్రభుత్వ 70 శాతం భరిస్తాయని చెప్పారు. సమావేశంలో చాంబర్ ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు, అనిల్ కుమార్ జైన్, లంకలపల్లి సుబ్బారావు, రవణాతి రవి, దొంగా రాంబాబు, సంగినీడి బాబులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఉప్పలగుప్తంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఉప్పలగుప్తంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారుకు అందిస్తున్న శ్రీకాంత్

ఉప్పలగుప్తం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కలుగుతున్న లబ్ధిని వివరించారు. గ్రామాలను అభివృద్ధి చేయటానికి ప్రతీ గ్రామానికి రూ.40 లక్షల ప్రత్యేక నిధులను కేటాయించారని వివరించారు. సదరు నిధులతో ప్రతీ గ్రామంలోనూ మౌలిక సదుపాయాల సమస్య పూర్తి స్థాయిలో తొలగిపోతుందన్నారు. 45 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన కాపు మహిళలకు కాపు నేస్తం కింద రూ.15 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేయూతగా రూ.18,750లు పార్టీలకతీతంగా అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, ఉప సర్పంచ్ మోకా శ్రీను, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, జగనన్న సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల రమణ, పార్టీ జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంతుశ్రీను, మోటూరి సత్యంకాపు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, యనమదల పల్లంరాజు, చెట్ల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రాభివృద్ధికి వామపక్షాలే ప్రత్యామ్నాయం



అమలాపురం బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సీతారామ్

అమలాపురం టౌన్: దేశ సమగ్రాభివృద్ధికి వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారామ్ అన్నారు. అమలాపురం హైస్కూలు సెంటరులో జిల్లా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో మొదలైన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. యాత్ర అమలాపురం వచ్చిన సందర్భంగా బహిరంగ సభలో సీతారామ్ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, ఆండ్ర మాల్యాద్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్‌గా రాఘవ



వైస్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాఘవ

అమలాపురం టౌన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్‌గా అమలాపురానికి చెందిన యెండూరి రాఘవ ఎన్నికయ్యారు. బోడసకుర్రు వంతెన సమీపంలోని బీఆర్‌కే కల్యాణ మండపంలో ఆమె చేత క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి మంగళవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమె అమలాపురం యెండూరి రాఘవ నాగేశ్వరరావు ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్య వైశ్య మహిళా విభాగం అడిషనల్ సెక్రటరీగా, అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలిగా పనిచేస్తున్నారు. రాఘవను సంఘ ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, వంకాయల కాశి, నంబూరి సత్యనారాయణమూర్తి, యెండూరి వెంకట్రామయ్య, వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి తదితరులు అభినందించారు.

స్పెషలిస్ట్ వైద్యులకు ఇంటర్వ్యూలు

యానాం: యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో సేవలు అందించడానికి స్పెషలిస్టు వైద్యులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య శాఖ డైరెక్టర్ శ్రీరాములు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న యానాం జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్స్, సర్జరీ, అనస్తీసియా, జీడీఎంఓ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. స్పెషలిస్టు వైద్యులకు నెలకు రూ.లక్ష, జీడీఎంఓలకు రూ.60 వేలు చొప్పున వేతనాలు ఉంటాయన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్యపరమైన సమస్యలు



తాళ్లరేవులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

తాళ్లరేవు: బాల్య వివాహాలు చేయడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని కాకినాడ జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ కొండా ప్రవీణ అన్నారు. మంగళవారం సీడీపీఓ వంజరాన మాధవి పర్యవేక్షణలో భేటీ పడావో–భేటీ బచావో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ ర్యాలీని ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. స్థానిక కార్యాలయం నుంచి సంతపేట సెంటర్ వరకు విద్యార్థినీ, విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ప్రవీణ మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు దాటిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. ఎంపీపీ రాయుడు సునీత మాట్లాడుతూ బాలికలకు చదువే ముద్దని, బాల్య వివాహాలు వద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకట్, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, ఆర్ఐ సాయితేజ పాల్గొన్నారు.

రికార్డులు భద్రపరిచేందుకు ప్రత్యేక గది కావాలి



ఎంపీడీఓ కృష్ణమోహన్‌కి వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అల్లవరం: ఉపాధి హామీ పథకంలో రికార్డులు భద్రపరిచేందుకు ప్రత్యేక గది కావాలని కోరుతూ ఎంపీడీఓ కృష్ణమోహన్‌ని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు గది కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వారితో భూగర్భ జల మట్టం సర్వే, 100 రోజుల పనిదినాలు, గృహ నిర్మాణంలో ఉపాధి కూలీలకు అవకాశం కల్పించడం తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్యాం, ఏడుకొండలు, సత్యప్రసాద్, మంగాయమ్మ, రామారావు, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



స్వాములతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఆయన కుమారులు

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కుమారులు సుమంత్, రేవంత్‌ల పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం సుంకరపాలెంలో అయ్యప్పస్వాములకు అన్నదానం చేశారు. స్థానిక శివాలయం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు 300 మంది అయ్యప్ప స్వాములకు ఎమ్మెల్యే పొన్నాడ ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. స్వాములతో కలిసి ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, ఆయన కుమారులు భోజనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాటం శెట్టి రామ్మూర్తి, దొరబాబు, ధర్మారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలలో ఎస్‌బీఐ మొదటి స్థానం



అంగన్‌వాడీ నిర్వాహకులకు ట్యాబ్‌ను అందిస్తున్న జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

అమలాపురం రూరల్: బ్యాంకింగ్ సేవలలో ఎస్‌బీఐ మొదటి స్థానంలో ఉందని ఎస్‌బీఐ అమరావతి జనరల్ మేనేజర్ కె.ప్రవీణ్ కుమార్ అన్నారు. పేరూరు అంగన్‌వాడీ కేంద్రానికి స్టేట్ బ్యాంకు ఇండియా అమలాపురం ప్రాంతీయ వ్యాపార కార్యాలయం ట్యాబ్, వాటర్ ఫిల్టర్‌ను ఆయన బహూకరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎస్.గుణేశ్వరరావు, సర్పంచ్ దాసరి అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ పరిహారం మంజూరు చేయాలి



ఆర్ఏఓ ఆఫీసుకు తరలివచ్చిన మత్స్యకారులు, చిత్రంలో మల్లాడి

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ మంజూరుచేసిన నష్టపరిహారాన్ని అర్హులైన మత్స్యకారులందరికీ చెల్లించాలని పలువురు మత్స్యకారులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆర్ఏఓ మునిస్వామిని కలిశారు. ఆంధ్రా ప్రభుత్వం ఇచ్చిన విధంగానే ఇక్కడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ అర్హులందరికీ పరిహారం ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.